



sahanamvande.com

epaper.sahanamvande.com

# సహానం వందే

హైదరాబాద్ | 20-08-2026 గురువారం | సంపుటి-02 సంచిక : 133 EDITOR: ROHINI




# యూనివర్సిటీలపై కాషాయ ఆపరేషన్

## విశ్వవిద్యాలయాలకు కేంద్ర మంత్రులు



- విద్యార్థులతో చిట్ చాట్ చేయాలని నిర్ణయం
- వారి మనసులో ఏముందో పసిగట్టే వ్యూహం
- నీట్ లీక్ రాజకీయ రగడతో మోడీ అలెర్ట్

**దేశంలో పెరుగుతున్న విద్యార్థి అసంతృప్తిని చల్లార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక వినూత్న వ్యూహానికి తెరతీసింది. యూనివర్సిటీలే వేదికగా నేరుగా యువతను ప్రసన్నం చేసుకునేందుకు ఒక కేంద్ర మంత్రి ప్రతిరోజూ ఒక విశ్వవిద్యాలయాన్ని సందర్శించే భారీ రాజకీయ ప్రణాళికను సిద్ధం చేసింది.**

**- సహనం వందే, న్యూఢిల్లీ**

యువత ఆలోచనలను నేరుగా తెలుసుకునేందుకు మోదీ ప్రభుత్వం ఒక రోజు ఒక విశ్వవిద్యాలయం అనే సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా ఉన్న యువతను ప్రసన్నం చేసుకునేందుకు ఈ ప్రణాళికను రూపొందించారు. దీని ద్వారా ప్రతిరోజూ ఒక కేంద్ర మంత్రి ఏదో ఒక యూనివర్సిటీకి వెళ్తారు. అక్కడ విద్యార్థులతో నేరుగా ముఖాముఖి చర్చలు జరుపుతారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై వారి అభిప్రాయాలను తెలుసుకుంటారు. అదే సమయంలో ప్రభుత్వ పథకాలను యువతకు వివరిస్తారు.

### కేబినెట్ భేటీలో కీలక చర్చ

ఈ వ్యూహాత్మక ప్రణాళికపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఇటీవల కేంద్ర కేబినెట్ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. దేశంలోని యువతను ప్రభుత్వానికి దగ్గర చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. ఈ భారీ ప్రణాళికను అమలు చేసే బాధ్యతలను విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయలకు అప్పగించారు. వీరు ఇతర కేంద్ర మంత్రులతో సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రణాళికలు రచిస్తున్నారు.

### నీట్ రగడతో రగిలిన రాజకీయాలు

ఈ కార్యక్రమం వెనుక బలమైన రాజకీయ కారణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ అంశంపై విద్యార్థులు తీవ్ర స్థాయిలో ఆందోళనలు చేపట్టారు. ఢిల్లీతో పాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో ఈ నిరసనలు ఉధృతమయ్యాయి. ఈ ఆందోళనలు రాజకీయ వేడిని పెంచాయి. పార్లమెంటు సమావేశాలలోనూ ప్రతిపక్షాలు ఈ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీశాయి. విద్యార్థుల ఆగ్రహం కట్టలు తెంచుకోవడంతో అప్పట్లో విద్యాశాఖ మంత్రిగా ఉన్న ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది.

### 1300 విశ్వవిద్యాలయాలు...


యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ అధికారిక లెక్కల ప్రకారం మన దేశంలో సుమారు 1300 విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వీటిలో 57 కేంద్ర విశ్వవిద్యాలయాలు ఉండగా 522 రాష్ట్ర విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. మిగిలిన విద్యా సంస్థలు డీమ్డ్, ప్రైవేట్ విశ్వవిద్యాలయాల పరిధిలోకి వస్తాయి. ఇంత భారీ సంఖ్యలో ఉన్న విద్యా సంస్థలన్నింటినీ కవర్ చేయడమే ఈ ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది.

### ప్రధాని మోదీ ప్రత్యేక ప్రకటనలు

విద్యార్థుల ఆగ్రహాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం సంక్షేమ ప్రకటనలపై దృష్టి పెట్టింది. ఇటీవలి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ విద్య, నైపుణ్యాలు, ఉపాధికి సంబంధించిన అనేక కీలక ప్రకటనలు చేశారు. ఉచిత ఆన్‌లైన్ కోచింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శిక్షణా కార్యక్రమాలను ప్రకటించారు. తయారీ రంగం, అంతరిక్షం, అణు శక్తి, సెమీకండక్టర్ల రంగాలలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు.

### రాజకీయ వ్యూహానికి అసలు పరీక్ష...

దేశంలో నెలకొన్న రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ఈ విశ్వవిద్యాలయాల పర్యటనలు ఎంతవరకు ఉపకరిస్తాయనేది ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియా ద్వారా ప్రధాని మోదీ చేసిన నేరుగా అప్పీళ్లు ఒకెత్తైతే, మంత్రులు స్వయంగా కాలేజీ క్యాంపస్‌లకు వెళ్లి విద్యార్థులను కలవడం మరోఎత్తు. విద్యార్థుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వారిని శాంతింపజేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ సమగ్ర ప్రణాళిక ద్వారా యువతలో ఉన్న అసంతృప్తిని పూర్తిగా తొలగించి తమ వైపునకు తిప్పుకోవాలని అధికార పక్షం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.



# బాబా బూతులు... కంగనా వాతలు

## రాందేవ్ వ్యాఖ్యలపై బాలీవుడ్ నటి ఫైర్

**రాజకీయాలు వ్యాపారం ఆధ్యాత్మికత ఇవన్నీ ఇప్పుడు ఒకే గాడిలో నడుస్తున్నాయి. బీజేపీ ఎంపీ కంగనా రనౌత్, యోగా గురువు బాబా రాందేవ్ మధ్య చెలరేగిన తాజా వివాదం దీనికి నిదర్శనం. ఒక మహిళ వ్యక్తిగత జీవితంపై బాబా చేసిన చౌకబారు వ్యాఖ్యలపై కంగనా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.**

**- సహనం వందే, న్యూఢిల్లీ**

- వ్యక్తిగత జీవితంలోకి రావడంపై ఆగ్రహం
- రాందేవ్ బాబా మోసాలపై కంగనా విమర్శ
- ఇద్దరి మధ్య ముదిరిన మాటల యుద్ధం



బాబా రాందేవ్ ఇటీవల హద్దులు దాటి మాట్లాడారు. బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ లక్ష్యంగా ఆయన బహిరంగ వేదికపై తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కంగనా చిన్నతనం ఎలా గడిచింది? ఆమె యవ్వనం ఎలా సాగింది? ఆమె సాధించిన విజయాలు ఏమిటి? అంటూ ఎద్దేవా చేశారు. ప్రస్తుత యువతను జనరేషన్ గట్టర్ అని కంగనా అనడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కలుషితమైన మనస్తత్వానికి నిదర్శనం అని రాందేవ్ తీవ్ర స్థాయిలో ఆరోపించారు.

### భగ్గుమన్న కంగనా...

రాందేవ్ చేసిన ఈ వ్యాఖ్యలు నేరుగా కంగనా చెవుల్లోకి వెళ్లాయి. ఎవరికీ భయపడని ఫైర్ బ్రాండ్ కంగనా అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. తనదైన శైలిలో ఆమె తీవ్రంగా విరుచుకుపడ్డారు. బాబా జీ నా యవ్వనం, బెడ్‌రూమ్ గురించి పగటి కలలు కనకండి అంటూ ఆమె నేరుగా ఘాటైన పదజాలంతో హెచ్చరించారు. కేవలం ఎవరో చెప్పే రూమర్లు గాసిప్‌ల ఆధారంగా ఒక మహిళ వ్యక్తిగత జీవితంపై కామెంట్లు చేయడం ఒక గురువుకు తగదని ఆమె గట్టిగా హితవు పలికారు.

### సుప్రీంకోర్టు చీవాట్ల అస్త్రం

కంగనా కేవలం ఆగ్రహం వ్యక్తం చేయడంతో సరిపెట్టలేదు. బాబా రాందేవ్ గత చరిత్రను, ఆయన నకిలీ వ్యాపారాన్ని ఆమె నేరుగా టార్గెట్ చేశారు. కనీసం తనకు ఇప్పటివరకు సుప్రీంకోర్టు నుంచి ఎలాంటి మొట్టికాయలు పడలేదని ఆమె గుర్తు చేశారు. తాను మాట్లాడే ప్రతి మాట కచ్చితమైన ఆధారాలతో ఉంటుందే తప్ప కట్టుకథల మీద కాదని స్పష్టం చేశారు. మార్కెట్లో వస్తువులను అమ్ముకోవడానికి తప్పుడు ప్రకటనలు, మోసపూరిత క్లెయిమ్‌లు చేసే వారి కంటే తన పాత్ర ఎంతో స్వచ్ఛంగా ఉంటుందని ఆమె తేల్చి చెప్పారు.

### నైతికతపై నిలదీత...

తన క్యారెక్టర్ గురించి మాట్లాడే నైతిక హక్కు బాబా రాందేవ్‌కు అసలే లేదని ఎంపీ కంగనా కుండబద్దలు కొట్టారు. తన క్యారెక్టర్ ఆయన కంటే ఎంతో మెరుగ్గా ఉందని, తనలో ఎలాంటి మోసాలు లేవని ఆమె ధీమాగా చెప్పారు. రాందేవ్ ఒక ఫ్రాడ్ అని ఆయన నుంచి తాను ఎలాంటి క్యారెక్టర్ పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదని మండిపడ్డారు. పతంజలి ఆయుర్వేద ఉత్పత్తుల ప్రకటనల విషయంలో సుప్రీంకోర్టు రాందేవ్‌ను తీవ్రంగా మందలించిన సంగతిని గుర్తుచేస్తూ ఆయన వ్యాపార సామ్రాజ్యం నైతికతను కంగనా కడిగిపారేశారు.

### రాజకీయ కలకలం...

బాలీవుడ్ నటిగా ఉన్నప్పటి నుంచి కంగనా ఎప్పుడూ వివాదాలకు కేంద్ర బిందువే. ఇప్పుడు అధికార పార్టీకి చెందిన ఎంపీగా ఆమె ఒక యోగా గురువును నేరుగా ఢీకొనడం రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ఒకరినొకరు కింది స్థాయికి దిగి విమర్శించుకోవడం వెనుక ఉన్న అసలు రాజకీయ కోణంపై సర్వత్రా చర్చ నడుస్తోంది. ఒకరు ఆధ్యాత్మికత ముసుగులో విమర్శిస్తే మరొకరు చట్టపరమైన అంశాలను అస్త్రాలుగా మలచి తిప్పికొడుతున్నారు. వీళ్లిద్దరి మధ్య నడుస్తున్న ఈ పబ్లిక్ వివాదం ఇప్పుడు జాతీయ స్థాయిలో పతాక శీర్షికలకు ఎక్కింది.

# దేశం దాటిన లక్ష కోట్లు

## దొంగ కంపెనీలతో నల్లధనం అక్రమ రవాణా

**దేశ సంపదను కొల్లగొట్టి విదేశాలకు తరలిస్తున్న బడా బాబుల గుట్టు రట్టయింది. ఏకంగా 1.29 లక్షల కోట్ల రూపాయలు అక్రమంగా దేశం దాటడం ఇప్పుడు తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. వేల సంఖ్యలో ఉన్న బోగస్ సంస్థల ద్వారా ఈ భారీ కుంభకోణం నడిచింది. ఆదాయపు పన్ను శాఖ రంగంలోకి దిగి ఈ అక్రమ లావాదేవీలపై ఉక్కుపాదం మోపుతోంది.**

**- సహనం వందే, హైదరాబాద్**

- ఆదాయపు పన్ను శాఖ ఉక్కుపాదం
- హవాలా మార్గాల గుట్టు రట్టు
- 6,422 సంస్థల కదలికలపై డేగకన్ను



దేశ ఆర్థిక వ్యవస్థను కుదిపేసే అతి పెద్ద కుంభకోణం ఇప్పుడు బయటపడింది. దేశం నుండి అక్రమంగా విదేశాలకు తరలిపోయిన నిధుల ప్రవాహం అందరినీ విస్మయానికి గురి చేస్తోంది. ఏకంగా 1.29 లక్షల కోట్ల రూపాయలు ఎలాంటి అనుమతులు లేకుండా సరిహద్దులు దాటాయి. ఈ భారీ గోల్‌మాల్ వెనుక పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు స్పష్టమవుతోంది. దేశంలోని సంపదను కొల్లగొట్టి విదేశీ ఖాతాల్లో దాచుకుంటున్న బడా బాబుల బండారం ఒక్కొక్కటిగా బయటపడుతోంది.

### ఆదాయపు పన్ను శాఖ దర్యాప్తు

ఈ భారీ అక్రమ రవాణాపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు అత్యంత దూకుడుగా దర్యాప్తు ప్రారంభించారు. ఈ దర్యాప్తులో ఏకంగా 6,422 సంస్థలు అనుమానాస్పద జాబితాలో చేరాయి. ఈ సంస్థలన్నీ కలిసి పక్కా పథకం ప్రకారమే నిధులను విదేశాలకు తరలించినట్లు అధికారులు గుర్తించారు. దేశంలో వ్యాపారాలు చేస్తున్నట్లు నమ్మిస్తూ, తెర వెనుక వేల కోట్ల రూపాయలను రహస్య మార్గాల్లో వెనక్కి పంపుతున్నారు. ఈ భారీ నెట్‌వర్క్ ఎక్కడెక్కడ విస్తరించి ఉందనే దానిపై అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు.

### హవాలా మార్గాల గుట్టు రట్టు

ఈ వేల కోట్ల రూపాయల గోల్‌మాల్ వెనుక క్లిష్టమైన హవాలా మార్గాలు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఎలాంటి వ్యాపార లావాదేవీలు జరగకుండానే కాగితాలపై బోగస్ కంపెనీలను సృష్టించారు. సేవల పేరుతో భారీ మొత్తాలను విదేశీ ఖాతాలకు మళ్లించి, ప్రభుత్వానికి పన్నులు ఎగవేశారు. ఈ హవాలా మాయాజాలం ఎంత దూరానికి పాకిందనే దానిపై ఇప్పుడు విచారణ వేగవంతమైంది.

### అనుమానాస్పద సంస్థల వేట

గుర్తించిన 6,422 సంస్థల కదలికలపై ఆదాయపు పన్ను శాఖ డేగకన్నేసింది. ఒక్కో సంస్థ జరిపిన లావాదేవీలను నిశితంగా పరిశీలిస్తూ అసలు సూత్రధారుల కోసం గాలిస్తున్నారు. ఈ కంపెనీల వెనుక ఉన్న అసలు వ్యక్తులు ఎవారనేది తేల్చేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతున్నారు. కేవలం కాగితాలపై మాత్రమే నడుస్తున్న ఈ షెల్ కంపెనీల ద్వారా దేశ ఆర్థిక భద్రతకు ముప్పు వాటిల్లుతోంది.

### విదేశీ గడ్డపై నల్లధనం

ఈ నిధులన్నీ సాధారణంగా పన్నులు తక్కువగా ఉండే లేదా రహస్య బ్యాంకింగ్ సౌకర్యం ఎక్కువగా ఉండే విదేశీ దేశాలకు తరలిపోయాయి. దేశంలో సంపాదించిన నల్లధనాన్ని విదేశీ గడ్డపై భద్రంగా దాచుకోవడానికి ఈ అక్రమ మార్గాలను ఎంచుకున్నారు. అంతర్జాతీయ స్థాయి నిబంధనలను దుర్వినియోగం చేస్తూ దేశ ఆర్థిక మూలాలను దెబ్బతీస్తున్నారు.